క్లుప్తంగా

34 శాతం వాటా హర్షణీయం

మణుగూరుటౌన్: సింగరేణి లాభాల్లో కార్మికులకు 34శాతం వాటాను ప్రకటించడం హర్షణీయమని మణుగూరు ఏరియా ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు అన్నారు. సోమవారం పీవీకాలనీలో ఉన్న సంఘం కార్యాలయంలో సమావేశం జరగగా.. ఆయన మాట్లాడారు. వాటా ప్రకటించిన సింగరేణి యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నాయకులు గట్టయ్య, అబ్దుల్ రవూఫ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం

మణుగూరురూరల్: సింగరేణి లాభాల వాటా నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.5,500 మాత్రమే ప్రకటించి సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు నాసర్ పాషా, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మధుసూధన్‌రెడ్డిలు విమర్శించారు. సోమవారం వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ.. సంస్థ బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతల లక్ష్య సాధనలో పరోక్షంగా ఎంతో కృషి చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పట్ల చిన్న చూపు చూడడం శోచనీయమన్నారు.

ఐటీఐలో బతుకమ్మ సంబురాలు

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీలో ఉన్న మణుగూరు ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీలలో బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయినులు రంగురంగుల పూలతో చేసిన బతుకమ్మలతో సందడి చేశారు. అనంతరం ఐటీఐ ప్రిన్సిపల్ జి.రవి మాట్లాడుతూ.. బతుకమ్మ నేపథ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఐటీఐ సూపరింటెండెంట్ టీఎస్ జ్యోతిరాణి, ఏటీఓలు ఎం.శ్రీనివాసరావు, జీవీ కృష్ణారావు, ఏ.నర్సయ్య, వేణుగోపాల నాయుడు, సిబ్బంది భాగ్యమ్మ, దేవకరుణ, నవీన్, భాగ్యమ్మ, మధు, భార్గవ్, శ్రావణి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కరకగూడెం: ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్‌లోని ఎవరైనా సభ్యుడు మరణిస్తే.. అతని కుటుంబంలోని ఆడపిల్లలకు ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా.. కరకగూడెం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ ముంజాల ప్రవీణ్ కుమార్ గౌడ్ ఆరు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించగా.. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, శక్తి డిజిప్రెస్ అధినేత మధుసూదన్ రెడ్డిల సహకారంతో సోమవారం ఇద్దరు ఆడపిల్లలకు కలిపి రూ.10వేల ఆర్థిక సాయాన్ని మృతిడి కుటుంబానికి అందజేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునగంటి సారయ్య, జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్ రెడ్డి, ఉమ్మడి పినపాక మండల అధ్యక్షుడు సిరిశెట్టి కమలాకర్, గౌరవ సలహాదారు ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

గుండాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి పరిశక రవి, నాయకులు బట్టు ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. పీవైఎల్ ఆళ్లపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు అరికట్టాలని ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాయకులు అటికం శేఖర్, ఎనగంటి లాజర్, పూనెం లక్ష్మణ్, మోకాళ్ల శేఖర్, పూనెం బక్కయ్య, బత్తిని సత్యం పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

చంద్రుగొండ: మండల కేంద్రంలోని చంద్రుగొండ పంచాయతీలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సెక్రటరీ రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. చంద్రుగొండతో పాటు ఇమ్మడి రామయ్య బంజర్, ఇందిరానగర్, అయన్నపాలెం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పార్టీ నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, వంశీకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను చేర్చుకోవాలి

భద్రాచలంటౌన్: జిల్లాలో మంజూరు చేసిన ఇసుక ర్యాంపుల్లో గిరిజన దివ్యాంగులను సభ్యులుగా చేర్చి, వాటిలో వస్తున్న ఆదాయం దివ్యాంగుల కుటుంబాలకి ఖర్చు పెట్టాలని భద్రాద్రి ఫిజికల్ హ్యాండీక్యాప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సెక్రటరీ అన్నం సత్తిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ ప్రజా గ్రీవెన్స్‌లో పీఓ బి.రాహుల్‌కి వినతిపత్రం అందజేశారు. సాయిరాం, శీను, రాజేష్, కృష్ణ చైతన్య, లక్ష్మయ్య, ఆనంద్, దుర్గ, వీరన్న, శివ ప్రసాద్, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

యూరియా అందించాలి

అశ్వారావుపేటరూరల్: రైతులకు యూరియాను తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తూ ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు గోగినపల్లి ప్రభాకర్ నాయకత్వంలో డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ హుస్సేన్‌కు అందించారు. నాయకులు వాసం బుచ్చిరాజు, ధర్ముల సీతారాములు, కుంజా అర్జున్, కంగాల భూలక్ష్మి, కారం మల్లేష్, వాసం పోతురాజు పాల్గొన్నారు.

వానొస్తే వరదే..



అంగన్‌వాడీ కేంద్రం వీధిలో నిలిచిన వరద నీరు

- వీధుల్లో నిలుస్తున్న నీరు
- సీసీరోడ్లు లేక అంతా బురదమయం
- అవస్థ పడుతున్న ప్రజలు

ములకలపల్లి: చిన్నపాటి వానొస్తే ఆ వీధిలో భారీగా నీళ్లు నిలుస్తున్నాయి. ఎగువ భాగం వస్తున్న వరద బీసీ అంగన్‌వాడీ వీధిలో ఆగిపోవడంతో, మోకాళిలోతు నీళ్లు నిల్వ ఉంటున్నాయి. దీంతో వరద ఇళ్ల ఆవరణలోకి కూడా వెళుతుండడంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యమే

ములకలపల్లిలోని బీసీ అంగన్‌వాడీ కేంద్రం వీధిలో నేటికీ సీసీ రోడ్డు లేదు. ముప్పైఏళ్ల క్రితం ఏర్పడ్డ ఈ వీధిలో వర్షాకాలంలో స్థానికులు నానాకష్టాలు పడాల్సివస్తోంది. వీధి ఎగువ భాగంలోని వరదంతా ఇక్కడకే చేరుతోంది. ఈ ప్రదేశం నుంచి కిందికి వెళ్లేందుకు నిర్మించిన మోరీలు మూసుకుపోవడం, కనీసం సీసీ రోడ్డు కూడా లేకపోవడంతో భారీగా నీళ్లు నిలిచిఉంటున్నాయి. దీనికి తోడు దిగువన ఉన్న జీపీ ఆఫీస్ వీధిలో ఇటీవల సీసీ రోడ్డు వేయడంతో, ఆ ప్రదేశమంగా ఎత్తుగా మారింది. దీంతో భారీ నీటి నిల్వలకు ఇవి ప్రధాన కారణంగా మారాయి. ఉపాధి హామీ పథకంలో రూ.5 లక్షలు మంజూరైనా నేటికీ పని మొదలుపెట్టిన జాడే లేదు. కనీసం రోడ్డు నిర్మాణం పూర్తయితే పక్కగా కాలువ తవ్వి, నీటి మళ్లింపుకు అవకాశం ఉంటుందని వీధివాసులు చెపుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మరీ ఇంత చిన్నచూపా?



వరద నీరు నిలుస్తున్న సమస్యను అధికారులకు విన్నవించినా స్పందన లేదు. సీసీ రోడ్డుకు నిధులిచ్చినా నేటికీ పనే చేయలేదు. అధికారులకు మా వీధిపై మరీ ఇంత చిన్నచూపా?

– కన్నెబోయిన వెంకటనర్సయ్య, స్థానికుడు

వారం రోజుల్లో పూర్తి చేస్తాం..



సాంకేతిక సమస్య నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. సమస్య మా దృష్టిలో ఉంది. వెంటనే పనులు మొదలు పెట్టి, వారం రోజుల్లోగా పూర్తి చేస్తాం.

– సురేష్‌కుమార్, పీఆర్ ఏఈ

డైవర్షన్ రోడ్డు బురదమయం..



ఓ వాహనం దిగబడటంతో నిలిచిపోయిన ఇతర వాహనాలు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామంలోని డైవర్షన్ రహదారి బురదమయంగా మారి వాహనాలు దిగబడుతున్నాయి. మండలంలో గత మూడు రోజులుగా సాయంత్రం సమయంలో కురుస్తున్న భారీ వర్షానికి వర్షపు నీరు డైవర్షన్ రహదారి పైకి చేరి చిత్తడిగా మారుతోంది. దీంతో దానిపైన వెళ్తున్న ఇసుక లారీల వల్ల గోతులు పడి దిగబడుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి తూరుబాక డైవర్షన్ దగ్గర వాహనాలు దిగబడి పోవడంతో ప్రజలు రాత్రి నుంచి సోమవారం వరకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భద్రాచలం–చర్ల ప్రయాణానికి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

దుమ్ముగూడెం: మండలంలోని మహాదేవపురం గ్రామంలోని రైతు వేదికలో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారం, ఆరోగ్యంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి, పర్ణశాల డాక్టర్ రేణుకారెడ్డిలు పౌష్టికాహారం ఆవశ్యకత గురించి వివరించారు. గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, నవజాత శిశువులు, చిన్న పిల్లలలో వచ్చే ఇబ్బందులు గురించి అవగాహన కల్పించారు. సంస్థ డైరెక్టర్ విజయ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో 44 గ్రామాల్లో సంస్థ హెల్త్–న్యూట్రిషన్ పై పనిచేస్తుందని తెలియాజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుశీల, రాజేశ్వరి, షహనా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతి

అశ్వారావుపేటరూరల్: పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని క్రమంతప్పకుండా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అశ్వారావుపేట ఏసీడీపీఓ అలేఖ్య అన్నారు. సోమవారం మండలంలోని గుమ్మడవల్లి పీహెచ్‌సీ ఆవరణలో ఐసీడీఏఎస్ ఆధ్వర్యంలో 'పోషణ మాసం'లో భాగంగా మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పోషకాహారంపై స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రదర్శించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మధులిక ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సౌజన్య, పద్మావతి, వరలక్ష్మి, రమాదేవి, ఏఎన్‌ఎంలు శాంతి, స్వరూప, బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు తగ్గించడం సరికాదు

అశ్వారావుపేటరూరల్: ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న దినసరి కార్మికుల వేతనాలను తగ్గించడం ప్రభుత్వానికి సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. సోమవారం అశ్వారావుపేట రింగ్ రోడ్ సెంటర్‌లో నియోజకవర్గంలోని ఆశ్రమ, హాస్టళ్లలో పని చేస్తున్న దినసరి కార్మికులంతా కలిసి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శ్రీనివాసరావు, మురహరి రఘు, అరుణ, రామలక్ష్మి, భద్రమ్మ, శ్రీను, పాపారావు, కరుణాకర్ పాల్గొన్నారు.

వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

గుండాల: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కారించాలని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు తోలెం సాంబయ్య, ఇల్లందుల అప్పారావులు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు ఇల్లందుల నరసింహులు, చీకటి యాకయ్య ,ఎస్టీ సెల్ అధ్యక్షులు మధు ,మండల నాయకులు వాగబోయిన కృష్ణ, వాగబోయిన నరసయ్య, తాటి శ్రీను పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామంలోని చర్ల–భద్రాచలం, పెద్దనల్లబల్లి–పైడిగూడెం రహదారిపై సీఐ వెంకటప్పయ్య ఆధ్వర్యంలో సోమవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు పార్టీ 21వ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు సమాచారం అందచేయాలని సూచిస్తున్నారు.



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ వెంకటప్పయ్య, సిబ్బంది

'రెవెన్యూ'లో అవినీతిని అరికట్టాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలని, ఏజెన్సీ ప్రాంతంలో రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలు అరికట్టాలని సోమవారం టీఏజీఎస్ ఆధ్వర్యంలో ములకపాడు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో ఆదివాసీ రైతులు భూభారతి, వారసత్వ పట్టాలు కోసం దరఖాస్తులు పెట్టి నెలలు గడుస్తున్నా, బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావట్లేదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో రెవెన్యూ శాఖ అధికారులు డబ్బులు ఇస్తేనే పట్టా పాస్ బుక్కులు, రేషన్ కార్డులు ఇస్తున్నారని, సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయాలను తహసీల్దార్ దృష్టికి తీసుకుపోయారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండల ప్రజల అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని, అవినీతి కార్యకలాపాలు చేపడుతున్న అధికారుల వివరాలను తన దృష్టికి తీసుకువస్తే సస్పెండ్ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు గౌరీ నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కంగాల రాంబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, నాయకులు తోడం తిరుపతిరావు, సరియం కోటేశ్వరరావు, మర్మం చంద్రయ్య, కొరస చిలకమ్మ, మీడియం జయ, కొమరం చంటి, కల్లూరి శీను, పాయం హరిబాబు, బొల్లి సత్యనారాయణ, యలమంచి శీను బాబు, కారం బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

కరకగూడెం: మండల పరిధిలోని భట్టుపల్లి రైతు వేదికలో నేటి మధ్యాహ్నం 2 గంటలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఐటీడీఏ ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కరకగూడెం ఎంపీడీఓ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాచారం అందుకున్న లబ్ధిదారులు, అధికారులు సకాలంలో తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు.

'గోదావరిఖని' సర్వీస్‌ను పునరుద్ధరించాలి

మణుగూరురూరల్: మహిళల రక్షణ, ప్రయాణికుల సౌకర్యార్థం గోదావరిఖని ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు ఆర్టీసీ మణుగూరు అధికారులను విజ్ఞప్తి చేశారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఆర్టీసీ మణుగూరు డిపో యాజమాన్యం గోదావరిఖని సూపర్‌లగ్జరీ సర్వీస్‌ను తాత్కాలికంగా నిలిపివేయడంతో ప్రయాణికులు, సింగరేణి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పండుగల సమయంలో ఇలాంటి నిర్ణయం సరికాదన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే

ములకలపల్లి: స్థానిక రైతువేదికలో పలువురు లబ్ధిదారులకు రూ.32 లక్షల విలువగల కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పంపిణీ చేశారు. అనంతనం గురుకులంలో రూ.9.5 లక్షలు, కస్తూర్బాలో రూ.14.5 లక్షలు, రూ.9.5 లక్షలతో హైస్కూల్‌లో భవిత భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ భూక్యా గనియా, ఏఓ అరుణ్‌బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, పర్వతనేని అమర్‌నాథ్, గాడి తిరుపతి రెడ్డి, పువ్వాల మంగపతి, కారం సుధీర్, మడకం చిరుమప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: చంద్రుగొండ, అన్నపురెడ్డి పల్లి మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం పంపిణీ చేశారు. అన్నపురెడ్డిపల్లిలోని గురుకులం కళాశాలలో, చంద్రుగొండ ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగుల కోసం భవితా భవనాల పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ సంధ్యారాణి, పీఆర్ డీఈ సైదుల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బోజ్యా నాయక్, వనమా గాంధీ, పర్వ వెంకట్, కిరణ్ రెడ్డి, కారేపల్లి శేఖర్, నల్లమోతు రమణ, ఇమ్రాన్, వసీం తదితరులు పాల్గొన్నారు.



ములకలపల్లి: కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జారె

రేషన్‌డీలర్లు సమయ పాలన పాటించాలి



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మణిధర్

అశ్వాపురం: రేషన్‌డీలర్లు సమయ పాలన పాటించాలని తహసీల్దార్ మణిధర్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రేషన్ డీలర్లతో తహసీల్దార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ ప్రజలందరికీ అందేలా చూడాలన్నారు. ప్రతి నెలా మొదటి నుంచి 15వ తేదీ వరకు రేషన్ బియ్యం ఇవ్వాలని, బియ్యం నిల్వలు, పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కోడాలి వెంకటేశ్వరరావు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతుకు సన్మానం



రంగారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కాకతీయ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'యూత్ ఫర్ యాంటీ కరప్షన్' సంస్థ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఉత్తమ రైతు విభాగంలో ఎంపిక చేసిన ఆదర్శ రైతు పోటు రంగారావును ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, చంగల్‌రావు, రామచంద్రరావు, నారాయణ దొర, చల్లగుల్ల నాగేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

'అరెస్టులు అక్రమం'

బూర్గంపాడు: హైదరాబాద్‌లో సోమవారం జరగాల్సిన లంబాడీల ఆత్మగౌరవ సభకు వెళ్లకుండా తమను అక్రమంగా అరెస్ట్ చేశారని సేవాలాల్ సేన మండల అధ్యక్షులు గుగులోత్ రాంబాబు ఆరోపించారు. ఈ అరెస్టులు వలన తమ ఉద్యమాన్ని అణిచివేయాలేరని స్పష్టం చేశారు.

24న పీవీటీజీల సమావేశం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఈ నెల 24న తెలంగాణ రాష్ట్ర పీవీటీజీ (పర్టిక్యూలర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్)ల ఐక్య వేదిక అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముర్ల రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పర్టిక్యూలర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్‌కు చెందిన చెంచు, కోలం, తోటితో పాటు కొండరెడ్డి జాతుల సమస్యలపైన చర్చించి.. భవిష్యత్తు కార్యచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

బూర్గంపాడు: ఆదివాసీ హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు తాటి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం బూర్గంపాడులో జరిగిన కార్యక్రమంలో చలో భద్రాచలం ఆదివాసీల ధర్మయుద్ధం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు బట్టా విజయ్‌గాంధీ, గనిబోయిన చింపిరయ్య, సున్నం భీమరాజు, పొడియం నరేందర్, కుర్సం వెంకన్న, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు..

దుమ్ముగూడెం: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో కొత్తగూడెం మహాధర్నా పోస్టర్లను సోమవారం అచ్చితాపురం గ్రామంలో ఆవిష్కరించారు. ఏఎస్పీ రాష్ట్ర నాయకుడు సోయం కామరాజు, మండల నాయకులు కుర్సం రవి, నాగరాజు, సోయం రవి, గట్టుపల్లి రాజేష్, సొందె రాము, గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేయాలి

దమ్మపేట: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఉపాధి కోల్పోయి ఆర్థికంగా దెబ్బతిన్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందజేయాలని ఏఐటీయూసీ నాయకులు సుంకిపాక ధర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండలకేంద్రం దమ్మపేటలో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాసేపు నిరసన వ్యక్తం చేసి.. తహసీల్దార్ భగవాన్ రెడ్డికి, సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ మాట్లాడగా.. బత్తుల సాయి, ఉమాకాంత్, దొంగ లక్ష్మీనారాయణ, నల్ల ప్రసాద్, సంకు రమేష్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులు

కొలువుదీరిన అమ్మవారు..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామగ్రామనా మండపాల్లో అమ్మవార్లు కొలువుదీరారు. మొదట భక్తులు డప్పు చప్పుళ్లు, బాణసంచా ధ్వనుల నడుమ దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. నవరాత్రి వేడుకల తొలిరోజు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో దర్శనమివ్వగా.. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్:మామిళ్లవారిగూడెంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ములకలపల్లి: మండపం వద్దకు అమ్మవారి విగ్రహాన్ని తోడ్కొని వస్తున్న భక్తులు



దమ్మపేట: నవరాత్రి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదినారాయణ దంపతులు



కరకగూడెం: బాలాత్రిపురసుందరి దేవి అలంకరణలో అమ్మవారు..



భద్రాచలంటౌన్: అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు..



పినపాక: దేవీ నవరాత్రుల్లో భాగంగా దుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గుండాల: ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం..



అశ్వాపురం: మొండికుంటలోని రాజీవ్ స్ట్రీట్‌లో..



చంద్రుగొండ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు